క్లుప్తంగా

నేడు కంటి వైద్యశిబిరం

కంభం: ఉన్నం చారిటబుల్ ట్రస్ట్ విజయవాడ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు ఉన్నం నరసింహారావు, రామాంజనేయులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో శంకర కంటి ఆస్పత్రి గుంటూరుకు చెందిన కంటి వైద్యులు పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తారని తెలిపారు. శస్త్ర చికిత్సలు చేయించుకునే వారికి భోజనం, వసతి సౌకర్యం ఉచితంగా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వైద్యశిబిరంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటరు కార్డు జిరాక్సు కాపీలు తీసుకొని రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 96666 77504 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి రూరల్: ఆర్టీసీ డిపోలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్ జె. సుందరరావు తెలిపారు. పొదిలి డిపో పరిధిలో ఉన్న పొదిలి, కొనకనమిట్ల, దర్శి, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి మండలాలలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు 9959225700 నంబర్‌కు ఫోను పొదిలి డిపో ఆర్టీసీ సర్వీసులు సమయాలు, ట్రిప్పుల గురించి తెలియజేయగలరని కోరారు.

ఏఎంసీ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా

మార్కాపురం రూరల్: మార్కాపురం అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీకి వైస్ చైర్మన్ పదవికి పి.మురళి రాజీనామా చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయనతో పాటు 5 మంది డైరెక్టర్‌లు తమ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఇప్పటికే చైర్మన్‌గా షంషీర్ అలీబేగ్ రాజీనామా చేసిన విషయం పాఠకులకు విదితమే.

చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణంలో ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం చెన్నకేశవస్వామి వారికి ప్రత్యేక పూజలు అర్చకులు వైభవంగా నిర్వహించారు. శనివారం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సందర్భంగా వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలను అర్చకులు అరుణ్‌స్వామి నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఆలయ చైర్మన్ కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారికి పూజలు..

కొనకనమిట్ల: కలియుగదైవం శ్రీవెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నమో వేంకటేశాయా నమోనమః అంటూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారి ఉత్సవ మూర్తులు



వెలుగొండలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

ఘనంగా బక్రీద్ వేడుకలు



నమాజ్ చేస్తున్న విద్యార్థులు



ఎదురాళ్లపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ



కొనకనమిట్లలో ముస్లింలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

కొమరోలు: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎస్‌బీఎన్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాలలో ముందస్తు బక్రీద్ వేడుకలను శనివారం పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బక్రీద్ పండుగ విశిష్టతను తెలియచేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీకగా ముస్లిం సోదరులు నిర్వహించుకుంటారని తెలిపారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కొనకనమిట్ల: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించి గొడవలకు కారణమవుతారో అటువంటి ఇవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మాధవరావు హెచ్చరించారు. శనివారం మండలంలోని మర్రిపాలెం, ఎదురాళ్లపాడు గ్రామల్లో పర్యటించి శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కలిపించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణంలో జీవించాలఅన్నారు. ఒకరికొకరు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. అనంతరం కొనకనమిట్ల వద్ద జాతీయ రహదారిపై పలు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా నడిపే వాహనాలకు చలానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత పోలీస్ స్టేషన్‌లో పలువురు ముస్లిం పెద్దతో సమావేశం నిర్వహించిన ఎస్ఐ మాధవరావు వారికి పలు సూచనలు చేశారు. బక్రీద్ పండగ పురస్కరించుకుని గోవధ నిషేధించామని చెప్పారు.

గో సంరక్షణ చట్టం అమలు చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందర్‌రావు

గిద్దలూరు రూరల్: గో సంరక్షణ చట్టం అమలయ్యేలా చూడాలని మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు అన్నారు. బక్రీద్ పండగ సందర్భంగా గోవధ జరగకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో బీజేపీ నాయకులు, ముస్లిం మత పెద్దలకు శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవులను అక్రమంగా రవాణ చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోవులను సంరక్షించడంలో సహకరించాలని ఆయన కోరారు. ముస్లింలు త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీదు పండగను తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని కోరారు. గోవులను సంరక్షించే కార్యక్రమంలో భాగంగా పోలీసులు, నగర పంచాయతీ, వెటనరి శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు. అందరం కలిసికట్టుగా గో సంరక్షణ బాధ్యతలు స్వీకరించాలని ఆయన కోరారు. సీఐ వైవీ సోమయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి, బీజేపీ నాయకులు డాక్టర్ ఆకుల నగేష్, రామాంజనేయులు, ఉదయ్‌శంకర్, ఎం.పుల్లయ్య, ముస్లిం పెద్దలు గఫూర్, పీరా, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోండి

● గోవధ నిషేధ చట్టం అమలు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు, పక్కన ఎస్సై రెహమాన్

మార్కాపురంటౌన్: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని, గోవధ నిషేధ చట్టం అమల్లో ఉన్నందున ఎవరైనా గోవులను వధిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మార్కాపురం పరిసర ప్రాంతాల్లో గోవధ ఎక్కడా జరగకూడదని హెచ్చరించారు. అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, గోవులను తరలించినా కూడా సహించేది లేదన్నారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్, మండల ఆర్ఐ శ్రీనివాసులు, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యతో ప్రజల ఇక్కట్లు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజానగర్, ఏబీఎం పాలెం, నల్లబండ బజారులోని శేషారెడ్డి వీధి, మంగలి కాలనీ, 5వ వార్డులో చాకలి వీధి, నెహ్రూ బజారు, శ్రీరామ్‌నగర్, లో ఓల్టేజీ సమస్యల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా వీధుల్లో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సింగి ఫేస్ తీగలను త్రీ ఫేస్‌గా మార్చకపోవడంతో ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి గృహోపకార వస్తువులు పూర్తిగా కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల వేసవి కాలంలో ఏసీలు వేయడంతో అధికలోడుల కారణంగా తరుచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడేదని స్థానికులు వాపోయారు. వర్షాకాలం సమయంలో ఈదురు గాలుల కారణంగా విద్యుత్ లోడు హెచ్చుతగ్గులు వస్తుండటంతో ఇంట్లోని ఫ్రిజ్, ఫ్యాన్లు, టీవీలు, మిక్సీ వంటి వస్తువులు కాలిపోతున్నాయి. సింగిల్ ఫేస్ కావడంతో ఆ వీధుల్లో వీధిలైట్లు తరుచూ కాలిపోతున్నాయని నగర పంచాయతీ సిబ్బంది తెలియజేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరినా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నట్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీఈఈ శేషగిరిరావును వివరణ కోరగా తమ వద్ద స్టాకు లేదని, ప్రతిపాదనలు పంపుతున్నామని చెబుతున్నారు.

యథావిధిగా కొనసాగనున్న విశ్వభారతి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ప్రారంభంపై హైకోర్టు తీర్పు వెలువరించిందని ఆ పాఠశాల కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు గిట్టని వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాఠశాలను మూతవేస్తున్నట్లు అధికారులు తొలుత ప్రకటించారు. ఆ మేరకు పాఠశాల యాజమాన్యం గౌరవ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో విశ్వభారతి స్కూల్‌ను యథావిధిగా కొనసాగించాలని ఆదేశించినట్లు రంగస్వామిరెడ్డి తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు అధైర్యపడకుండా పిల్లలను పాఠశాలకు పంపాలని ఆయన కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



ఫంక్షన్‌లో పాల్గొన్న ఉడుముల, నాయకులు

కొనకనమిట్ల: అధికారం లేదని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధైర్య పడవద్దని ఎల్లప్పుడూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి అన్నారు. శనివారం కాట్రగుంట గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుమార్తె ఓణీల ఫంక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో పలు విషయలపై చర్చించారు. గ్రామాల్లో మళ్లీ పార్టీ అభివృద్ధే లక్ష్యంగా మన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉందామన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో పాటు తాను కార్యకర్తలకు అండగా ఉంటామని కార్యకర్తలకు ఉడుముల భరోసా ఇచ్చారు. సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, పార్టీ నాయకులు కల్లం దిబ్బారెడ్డి, యక్కంటి తిరుపతిరెడ్డి, సీసీకేఆర్ శ్రీనివాసులరెడ్డి, ఏలూరి సంజీవరెడ్డి, ఎంఆర్ఎఫ్ వెంకటేశ్వరెడ్డి, కందెర పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ

గిద్దలూరు రూరల్: రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి విష్ణుప్రియ అన్నారు. మండలంలోని కె.ఎస్.పల్లె, బురుజుపల్లె గ్రామాల్లో డిజిటల్ ఈ మిర్చా గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి పరీక్షల ఆధారంగా వచ్చిన ఫలితాలను అనుగుణంగా ప్రతి రైతు పంటలు వేయాలన్నారు. రసాయన ఎరువుల యాజమాన్య విధానాన్ని రైతులు చేపట్టాలన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు అధిక దిగుబడులు సాధించే విధంగా పంటలు సాగు చేయాలన్నారు. డిజిటల్ ఈ మిర్చాగ్రీన్ సంస్థతో మిరప పండించే రైతులకు సలహాలు సూచనలు తెలియజేస్తామన్నారు. డిజిటల్ గ్రీన్ ప్రతినిధి చంద్రశేఖర్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్లరంగ నాయకస్వామి దర్శనం కోసం శనివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. దేవస్థానం అర్చకులు అన్నవరం పాండురంగచార్యులు, అన్నవరం సత్యనారాయణచార్యులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు గోపాలకృష్ణ యాదవ, కృష్ణదేవరాయుల కాపుబలిజ, కాశినాయన, యోగివేయన రెడ్ల, అర్యవైశ్య అన్నదాన సత్రాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రజాక్ తదితరులు

మార్కాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ కోరారు. శనివారం పట్టణంలో విద్యా జాగృతి మాసోత్సవాల్లో భాగంగా ఇస్లాంపేట మసీదు వద్ద పాంప్లేట్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జూన్ 15నుంచి జూలై 1 వరకు ఎంపీజే ఆధ్వర్యంలో విద్యా జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎంపీజే నాయకులు అబ్దుల్ రసూల్, షేక్ ఖాశీం, షేక్ జహీర్, మహబూబ్‌ఖాన్, ఖాశీంసా, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామికి విశేష పూజలు

తర్లుపాడు: తర్లుపాడులో వెలసిన శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామికి శనివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించి పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. తర్లుపాడులోని పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గిద్దలూరు రూరల్: మద్యం మత్తులో ఓ వ్యకిత గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని దిగువమెట్ట గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద శనివారం జరిగింది. నంద్యాలకు చెందిన షేక్ బాషా అనే వ్యక్తి మద్యం మత్తులో గూడ్స్ రైలు కింద పడబోయి అదృష్టవశాత్తు గాయాలతో బయటపడ్డాడు. గాయాలపాలైన అతడిని చికిత్స కోసం 108 సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకుని గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న నంద్యాల జీఆర్‌పీఎఫ్ సిబ్బంది కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.